

# పుస్తక పరిచయం




For copies write to KOUMUDI

ఒక స్థాయిగల మంచి కవితలు వ్రాసే అమెరికాలోని ప్రవాసాంధ్ర కవుల్లో మొదటి వరుసలో నిలుస్తారు డాక్టర్.వైదేహి శశిధర్ గారు. వీరు ఇటీవల ప్రచురించిన స్వీయ కవితాసంపుటి 'నిద్రిత నగరం' లో చిక్కని కవితాత్మ పొదిగిన 32 కవితలు ఉన్నాయి. వరుసగా కవితలు చదువుతున్నప్పుడు ఎదురయ్యే పద సౌందర్యం, భావప్రకటన, దృశ్యాలని కళ్ళముందు నిలబెట్టే చిత్రీకరణ.. గమనిస్తే తిలక్ కనిపిస్తారు చాలా చోట్ల. ఈ కవితల పూదోటలో వాహ్యాళికి వెళితే అమృతం కురిసిన రాత్రులు పలకరిస్తాయి. చెదిరిన పుప్పొడి రేణువులు, స్వప్నాల రెక్కలు విప్పే సీతాకోకచిలుకలు, ఉమ్మెత్త పువ్వులా నవ్వే ఉదయాలు, కోనేటి మీదికి వంగిన నిద్రగన్నేరు, రాలుతున్న మంచులోని రాధామాధవాలు.. అన్నీ, ఇంకెన్నో ఆత్మీయంగా మనసు మూలల్ని స్పృశిస్తాయి. కొంతమంది తాము పలవరించే భావాలని కవిత్వీకరించడంకోసం దృశ్యాలని ఉపమానాలుగా వాడుకుంటారు. కానీ ఈ కవయిత్రి ఎక్కువగా తాను చూసిన దృశ్యాలని మృదు మధుర భావాల రూపంలోకి తర్జుమా చేసుకుని కవితా పంక్తులలో అలంకరిస్తారు.

'ఓ సాయంత్రం', ''ఏటి వొడ్డున',' ప్రవాసంలో వాన',' నేరేడు చెట్టు',' 'అమెరికాలో వసంతం',' 'వేసవిలో ఓ రోజు..' ఇలాంటి సుందరదృశ్యాలెన్నో ఈ కవయిత్రి కలాన్ని కదిలించి మన మనసులకి హత్తుకుపోయే కవితలుగా రూపుదిద్దుకున్నాయి.

*'నిద్రించిన నా స్వప్నాలన్నింటినీ*
*పున్నాగ పూల గుత్తులుగా మేల్కొలిపి*
*ఓ గాఢమైన పరిమళ ప్రవాహంలో*
*నన్ను ముంచి వేస్తావు.. '*

*'ఆదమరచి నిద్రించిన హిమ సుందరి ధవళ చేలాంచలం*
*విశమించిన వేయి పడగల శ్వేతనాగై తోటను కప్పేసింది.. '*

కవిత్వాన్ని చదివి, అనుభూతుల్లోకి అనువాదం చేసుకుని, మళ్ళీ మళ్ళీ నెమరు వేసుకోవాలనుకునే వారందరూ తప్పక చదవాల్సిన కవితా సంపుటి. . ***




**కవిగా** ఈ పుస్తకంలో దర్శనమిచ్చే రామిరెడ్డి గారు..నిజానికి విరామమెరుగక పరిశ్రమించే సామాజిక సేవా యోధుడు. సమాజసేవని విశ్వసించి, ఆచరించి ఎందరికో ఉదాహరణగా నిలిచే ‘మనిషి‘. కవి బాధ్యత కేవలం కవిత్వాన్ని వ్రాయడంతో ఆగిపోక తాము చెప్పేవాటిని ఆచరించే ధైర్యం, అంకితభావం ఉండాలని ‘అనరు..చెప్పరు..‘ కానీ చేతల్లో నిరూపిస్తారు. ఈ సంపుటిలోని ప్రతి కవితలోనూ మానవత్వం, మనిషితనం విశ్వరూపంలో దర్శనమిస్తాయి. తన ముందు మాటలో చెప్పినట్లే రామిరెడ్డి గారి ఊహల్లోంచి కవిత్వం రాదు..వాస్తవాలు మనసుని కదిలించినప్పుడు, ఆ స్పందనలు నిజాయితీ గల కవితలుగా రూపుదిద్దుకుంటాయి. ‘పత్తి తియ్యటం గురించి‘, ‘వరద తర్వాత మిగిలిన శిథిల జీవితాల‘ గురించి వ్రాయాలంటే ఎంతో పరిశీలానసక్తే కాక నిబద్ధత, అంకిత భావం ఉండాలి. ‘పుట్టెడు ప్రేమ, గుప్పెడు దుఃఖం అదే మనిషి జాడ‘

*‘‘గాయం కూడా ప్రాణ ధాతువే..‘*

*‘సహజ ప్రవాహాలను లోనికి పిండుకుని*
*రక్తాన్ని శుద్ధి చేసుకోవాల్సి ఉంది..‘*

*‘ఒకే విశ్వం మనిషి సొంతం*
*ఒకే స్వప్నం మనిషికిష్టం..‘*

చాలా కవితల్లో తాను చెప్పదలుచుకున్న సందేశాన్ని సంక్షిప్తీకరించి చివరలో రెండు మూడు పంక్తుల్లో చెబుతారు. అవి చదివాక మళ్ళీ ఒకసారి కవిత చదివి ముగింపుని కవి ఎలా అన్వయించాడో పునశ్చరణ చేసుకోవలనిపిస్తుంది. కవిగా రామిరెడ్డి గారి నిజాయితీ గల కవిత్వం ఒక ఎత్తు ఐతే, పేద విద్యార్థులకి ఆయన అందిస్తున్న సహాయం ఇంకొక ఎత్తు. తాను చదువుకోడానికి చిన్నప్పుడు పడ్డ కష్టాలని మరిచిపోకుండా అలాంటి కష్టపడే విద్యార్థినీ విద్యార్థులకి తన జీతాన్నీ, జీవితాన్నీ వెచ్చిస్తున్న రామిరెడ్డి గారు ‘మానవత్వం‘ ఆచరించి నిరూపించే మనసున్న కవి.

ఈ పుస్తకం అమ్మకాల ద్వారా వచ్చే మొత్తాన్ని పేద విద్యార్థుల సహాయం కోసం ఖర్చుపెడుతున్నారు. అందుకే ఈ పుస్తకాన్ని కొని చదవండి..‘నిజాయితీ‘ గల కవిత్వాన్ని ఆస్వాదించండి..నిస్వార్థమైన విద్యార్థి సేవా కార్యక్రమాలకి మీ వంతు చేయూతనివ్వండి.

***

***For Copies***
***M.Rajualakshmi***
***102, Sri Kota Residency***
***Near Polce Station***
***Miyapur, HYDERABAD 500 049***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

Editor, KOUMUDI(Web Monthly)
4251 Escudo Ct, Dublin, CA 94568,USA